నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I | హైదరాబాద్, సోమవారం 16 జూన్ 2025 | RANGAREDDY




ఆదివారం సెలవు దినం కావడంతో మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకులు భారీగా తరలి వచ్చారు. మండల నలుమూలల నుంచే కాకుండా జిల్లా చుట్టుపక్కల ప్రాంతాలవారు, వేరే ప్రాంతాల నుంచి ప్రజలు ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు ఉత్సాహం చూపారు. కుటుంబసమేతంగా ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం ఆనందంగా తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. - ధారూరు, జూన్ 15

# అందని వైద్యం..

రంగారెడ్డి జిల్లాలోని వెటర్నరీ ఆస్పత్రులు, సబ్‌సెంటర్లకు గత కొన్ని నెలలుగా సరఫరా కాని మందులు

# భారంగా పశుపోషణ

- డబ్బులు వెచ్చించి బయట కొంటున్న పాడి రైతులు
- పశు వైద్యంపై దృష్టి సారించని కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్‌ఎస్ హయాంలో సమృద్ధిగా నట్టల నివారణ, అత్యవసర మందులు



మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న వైద్యులు (ఫైల్)

రంగారెడ్డి, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : పల్లెల్లో పశు వైద్యం పడకేసింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మూగ జీవాలకు ఎలాంటి వ్యాధులు సోకకుండా ఎప్పటికప్పుడు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందులు, ఇతరత్రా వ్యాధులకు సంబంధించిన మందులను అందించేవారు. అత్యవసర వైద్యానికి 1962 వాహనాలు కూడా అందుబాటులో ఉండేవి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. జిల్లాలో పశు పోషణ భారంగా మారిందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. సకాలంలో వైద్యం అందకపోవడంతోపాటు ప్రభుత్వం నుంచి ఉచితంగా రావాల్సిన నట్టల నివారణ మందులు, యాంటీ బయోటిక్స్, ఇతర అత్యవసర మందులు అందడంలేదని.. పశు వైద్యశాలలకెళ్తే స్టాక్ లేదని.. ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుక్కోవాలని అక్కడి సిబ్బంది చిట్టీలు రాసిస్తున్నారని వాపోతున్నారు. ఆ మందులను బయట కొనాలంటే రూ.500-రూ.2వేల వరకు ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. దీంతో గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రైమరీ వెటర్నరీ ఆస్పత్రులు, సబ్‌సెంటర్లు పేరుకే అన్నట్లుగా మారిపోయాయి. జిల్లాలో ఆవులు, గేదెలు, ఎద్దులు కలిపి సుమారు 4,70,000, గొర్రెలు, మేకలు 10,00,000 వరకు ఉన్నాయి. మూగ జీవాలు రోగాల బారిన పడినప్పుడు పశు వైద్యశాలకెళ్తే అవసరమైన మం దులు కాకుండా సాధారణ మందులను ఇస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అవసరమైన మందులు కావాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు.

### వ్యాధుల బారిన మూగజీవాలు

ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ముందస్తుగా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వ్యాధి నివారణ టీకాలు వేయించాల్సి ఉంటుంది. బీఆర్‌ఎస్ హయాంలో జూన్ నెలలోనే మూగజీవాలకు నట్టల నివారణతోపాటు వ్యాధి నిరోధక టీకాలను వేయించేవారు. ప్రస్తుత ప్రభుత్వం మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించకపోవడంతో అవి మృతువాతపడుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గ్రామాల్లో పశుపోషణ భారీగా పెరిగి ఎంతో మంది దానిపై ఆధారపడి జీవించారు. నేడు ఆ పరిస్థితి అగుపించడంలేదు.

### సకాలంలో అందని 1962 వైద్య చికిత్సలు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూగజీవాలకు సత్వరమే వైద్యాన్ని అందించేందుకు 1962 వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. కాని, కాంగ్రెస్ సర్కార్ ఆ వాహనాల్లో పని చేసే సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఉద్యోగాలు మానేశారు. తద్వారా పశువులకు అత్యవసర వైద్య చికిత్సలు కూడా అందడంలేదు. 1962 వాహనాలు తమ గ్రామాల్లోకి రావడమే లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

### సిబ్బంది, మందులు లేక ఇబ్బంది

గత ప్రభుత్వం ప్రతి గ్రామానికీ పశువైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ప్రైమరీ వెటర్నరీ ఆస్పత్రులు, సబ్‌సెంటర్లను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం అత్యవసర సమయంలో ఆస్పత్రులకెళ్తే వైద్యులతోపాటు సిబ్బంది లేకపోవడంతో మూగజీవాలకు చికిత్స అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవేళ వైద్యులు అందుబాటులో ఉన్నా మందులు ఉండడంలేదని.. వాటిని బయట ఉన్న షాపుల్లో కొనుగోలు చేయాలని అక్కడి సిబ్బంది చిట్టీలు రాసి ఇస్తున్నారు. ఎందుకు మందుల్లేవని ఎవరైనా ప్రశ్నిస్తే.. ప్రభుత్వం నుంచే మందులు సరఫరా కావడంలేదని చెబుతున్నారు. ప్రస్తుతం సరిపడా సిబ్బంది లేక పల్లెల్లోని ఉన్న పశు వైద్యశాలలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కొన్ని రోజులుగా తెరవడమే లేదు. మరికొన్ని ప్రాంతాల్లో ఉదయం తెరిచి మధ్యాహ్నానికే మూసేస్తున్నారు. వీఎల్‌వోలు, అటెండర్లు లేక ఒకే అధికారి పని చేస్తున్న పశు వైద్య కేంద్రాలు జిల్లాలో చాలా ఉన్నాయి.



పేదల భూములు

# గోశాలకు ఇవ్వొద్దు..

- ప్రభుత్వం బలవంతంగా తీసుకోవాలని చూడడం దారుణం
- చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కే ఎస్ రత్నం
- ఎన్కేపల్లిలోని భూబాధితులను కలిసి వివరాల సేకరణ



ఎన్కేపల్లిలో భూబాధితులను కలిసి వివరాలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

మొయినాబాద్, జూన్ 15 : పేదల భూములను రేవంత్‌రెడ్డి సర్కార్ అక్రమంగా లాక్కోవాలని చూడడం అన్యాయమని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కే ఎస్ రత్నం అన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధి ఎన్కేపల్లిలోని సర్వే నం.180లోని 100 ఎకరాల భూమిని 50 మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేదలు కొన్నేండ్లుగా సాగు చేసుకుని జీవిస్తున్నారని.. వారి భూములను సర్కార్ బలవంతంగా తీసుకోవాలని భావించడాన్ని నిరసిస్తూ ఆదివారం ఆయన భూబాధితులను కలిసి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1954 నుంచి రైతులు ఆ భూములను సాగు చేసుకుని జీవిస్తున్నారని.. అప్పటి ప్రభుత్వాలు రైతులకు పాస్ బుక్కులను కూడా జారీ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం పేదల భూములను తీసుకొని గోశాలకు ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కోకాపేటలోని గోశాలకు కేటాయించిన 100 ఎకరాల భూమిని విక్రయించాలని ప్రభుత్వం యత్నిస్తూ.. ఆ భూమికి బదులుగా ఎన్కేపల్లిలోని రైతులు సాగు చేసుకుంటున్న భూమిని గోశాలకు కేటాయించాలని చూస్తున్నదని మండిపడ్డారు. గోశాలకు ఇచ్చేందుకు దళితులు, వెనుకబడిన వర్గాలకు చెందిన భూములే ఉన్నాయా..? అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అప్పటి ప్రభుత్వాలు పేదలకు భూములిస్తే .. రేవంత్‌రెడ్డి మాత్రం పేదల నుంచి భూములను లాక్కోవడం చాలా అన్యాయమని మండిపడ్డారు. భూములను సాగు చేసుకుని జీవిస్తున్న రైతులకు అన్యాయం చేయాలని చూస్తే పెద్దఎత్తున ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన ఆలోచనను ఉపసంహరించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఆయనతో పాటు నాయకుడు ప్రకాశ్, మాజీ సర్పంచ్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

# పుణ్యస్నానానికి వెళ్లి..

## గోదావరిలో మునిగి..ఐదుగురు నగరవాసులు మృతి



సిటీబ్యూరో/జీడిమెట్ల/మలక్‌పేట, జూన్15 (నమస్తే తెలంగాణ) : వారంతా ఒకే కుటుంబానికి చెందిన 20 ఏండ్లలోపు యువకులు.. కుటుంబమంతా కలిసి బాసర సరస్వతీ అమ్మవారి దర్శనానికి వెళ్లారు. గోదావరిలో పుణ్యస్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నీటమునిగి అసువులు బాసి.. ఆ కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చారు. రాజస్థాన్‌కు చెందిన మూడు కుటుంబాలు హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్నాయి. ఆదివారం బాసర అమ్మవారి దర్శనానికి ఆ కుటుంబాలకు చెందిన 18 మంది వెళ్లారు. ఈ సందర్భంగా ఐదుగురు యువకులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేస్తుండగా, గల్లంతయ్యారు. గోదావరిలో తేలిన ఇసుక మేట వద్దకు చేరుకుని స్నానాలు చేస్తుండగా, లోతైన ప్రాంతంలో మునిగి చనిపోయారని పోలీసులు చెప్పారు. దిల్‌సుఖ్‌నగర్ శాలివాహననగర్ చెందిన కిరాణా వ్యాపారి ప్రవీణ్ తమ్ముడు రితిక్(22), అతడి బంధువు మోహన్(19), కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు రాకేశ్ (20), మదన్ (18), భరత్ (16) గోదావరి నదిలో స్నానానికి వెళ్లి మృతిచెందారు. చనిపోయినవారంతా దగ్గరి బంధువులు కావడం.. ఒకే కుటుంబం నుంచి ముగ్గురిని కోల్పోవడంతో కుటుంబసభ్యులు రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది.



# ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్!

- ఏటా రూ.50 వేల వరకు ఆదా
- ఉస్మానియా వర్సిటీ మహిళా హాస్టల్‌లో ఏర్పాటు
- ఎల్‌పీజీ, వంట చెరకు వాడకానికి స్వస్తి

సిటీ బ్యూరో, జనవరి 15 (నమస్తే తెలంగాణ) : వండుకుని తినగా మిగిలిన ఆహార వ్యర్థాలనే గ్యాస్‌గా మార్చి వంట చేస్తున్నారు. ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్ ఉత్పత్తి చేసి ఏకంగా 400 మందికి సరిపడా ఆహారాన్ని వండుతున్నారు. ఎల్పీజీ గ్యాస్, వంట చెరకుకు అయ్యే రూ.50 వేల ఖర్చును ఆదా చేస్తున్నారు. ఈ వినూత్న పద్ధతిని ఓయూలోని మహిళల హాస్టల్‌లో పాటిస్తున్నారు. మహిళల మెస్‌లో వంట చేయడానికి ఆరు నెలలుగా ఆహార వ్యర్థాలతో తయారు చేసిన బయోగ్యాస్‌నే వాడుతున్నారు. ఖర్చుతో పాటు యూనివర్సిటీ పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నారు. ఈ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే పునాది పడింది. యూనివర్సిటీలోని అప్పటి అధికారులు ప్రతిపాదనలు చేసి, పనులు పూర్తి చేసి 2024 డిసెంబర్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఈ బయోగ్యాస్ ప్లాంట్ వందలాది మంది విద్యార్థులకు దోహదపడుతున్నది.

### ప్లాంట్ ద్వారా 300 నుంచి 400 మందికి వంట

బయోగ్యాస్ ప్లాంట్ నుంచి వచ్చే గ్యాస్‌ను వినియోగించేందుకు వంట గదుల్లో ప్రత్యేకమైన బయోగ్యాస్ స్టవ్‌లను ఏర్పాటు చేశారు. ప్లాంట్ నుంచి నేరుగా స్టవ్‌కు గ్యాస్ సరఫరా అవుతుంది. దీని ద్వారా నిత్యం 300 మంది నుంచి 400 మంది విద్యార్థులకు సరిపడా ఆహారాన్ని వండుతున్నట్లు ఉమెన్స్ హాస్టల్ డైరెక్టర్ కల్యాణలక్ష్మి తెలిపారు. ఈ బయో గ్యాస్ ద్వారా ఎల్‌పీజీ, వంట చెరకుకు అయ్యే రూ. 40 వేల నుంచి రూ.50 వేలను ఆదా చేస్తున్నామని వెల్లడించారు. హాస్టల్‌లోని ఒక కిచెన్‌లో నెలకు 19 గ్యాస్ సిలిండర్లు వాడేవారు. 13.34 టన్నుల వంట చెరకు వినియోగించేవారు. ప్రస్తుతం పూర్తిగా ఈ ప్లాంట్ నుంచి వచ్చిన బయోగ్యాస్‌నే వాడుతున్నారు. ప్లాంట్ వినియోగంలోకి వచ్చిన ఆరు నెలల నుంచి క్యాంపస్ వాతావరణం పూర్తిగా మారిపోయిందని చెప్పారు. ఈ బయోగ్యాస్ ప్లాంట్లను అన్ని యూనివర్సిటీల హాస్టళ్లలో ఏర్పాటు చేస్తే ఎల్‌పీజీ, వంట చెరకు వినియోగాన్ని తగ్గించి పర్యావరణానికి మేలు చేయవచ్చని చెప్పారు. మెన్స్ హాస్టల్‌లో కూడా ఇలాంటి బయో గ్యాస్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

### బయోగ్యాస్ తయారీ ఇలా..

ఉమెన్స్ హాస్టల్ పరిసరాల్లో ఆహార వ్యర్థాల బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయగా.. రోజూ రెండు టన్నుల తడి ఆహార వ్యర్థాలను ప్రాసెస్ చేస్తున్నారు. మెస్‌ల నుంచి ఆహారవ్యర్థాలను ఎలక్ట్రిక్ వాహనం ద్వారా డబ్బాల్లో సేకరిస్తారు. వాటిని ప్లాంట్ వద్దకు తీసుకొచ్చి తూకం వేసి సార్టింగ్ టేబుల్‌కు చేరుస్తారు. అక్కడ ఆహార వ్యర్థాలను క్రషర్‌లో వేసి చూర్ణం చేస్తారు. ఆ చూర్ణాన్ని స్లర్రీతో కలిపి డైజెస్టర్ ట్యాంకుకు పంపిస్తారు. డైజెస్టర్ ట్యాంక్‌లోకి చేరుకున్న వ్యర్థాల చూర్ణం పూర్తిగా డైజెషన్ అవుతుంది. ఇందులోంచి బయోగ్యాస్ ఏర్పడుతుందని ప్లాంట్ ఆపరేటర్ చెబుతున్నారు. ఇది ట్రాప్ స్క్రబ్బర్ ద్వారా హైడ్రోజన్ సల్ఫైటః‌తో పాటు తేమను గ్రహిస్తుంది. ఈ ప్రాసెస్‌లో 60 శాతం మిథేన్ మిశ్రమం శుద్ధవుతుంది. శుద్ధి చేసిన మిథేన్‌ను బయోగ్యాస్ నిల్వచేసే బెలూన్‌లకు పంపిస్తారు. అక్కడి నుంచి పైప్ సిస్టం ద్వారా హాస్టల్ వంటగదికి సరఫరా చేస్తారు. దీని వినియోగం వల్ల నెలకు 85 టన్నుల కార్బన్ ఉద్గారాలు వెలువడకుండా నిరోధిస్తున్నారు.

# పల్లెపాలన అస్తవ్యస్తం

- రంగారెడ్డిజిల్లాలో నిధులు లేక అభివృద్ధికి నోచని గ్రామాలు
- ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కరువు
- పనిభారంతో ఇబ్బందులు పడుతున్న పంచాయతీ కార్యదర్శులు
- పల్లె ప్రకృతివనాలు, వైకుంఠధామాల పరిస్థితి అధ్వానం
- పొంచివున్న వ్యాధులతో ప్రజల అవస్థలు



షాబాద్, జూన్ 15 : గ్రామాల్లో పల్లెపాలన అస్తవ్యస్తంగా తయారైంది. పంచాయతీల్లో డబ్బులు లేక, ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతున్నది. గతేడాది జనవరి 31తో గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. అప్పటి నుంచి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఆయా గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. గ్రామపంచాయతీల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో వీధి దీపాలు, బోర్ల మరమ్మతులు, పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్ కొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులకు సైతం జీతాలు చెల్లించలేని స్థితిలో పంచాయతీలున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడి పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెరిగింది. పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేయడంతో పాటు సరైన నిర్వహణ లేక పల్లెప్రకృతివనాలు, వైకుంఠధామాల పరిస్థితి అధ్వానంగా మారింది.

### పంచాయతీ కార్యదర్శులపై పనిభారం

జిల్లావ్యాప్తంగా చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, ఆమనగల్లు, మహేశ్వరం, రాజేంద్రనగర్, నియోజకవర్గాల పరిధిలోని 21 మండలాల్లో మొత్తం 526 గ్రామ పంచాయతీలున్నాయి. 16 నెలల క్రితం గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగిసింది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగిస్తున్నది. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ అంతంతా మాత్రంగానే ఉండడంతో పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెరిగింది. హరితహారం, ఉపాధిహామీ, పల్లెప్రగతి, ఇంటి పన్నుల వసూలు, పారిశుధ్యం తదితర పనులతో పంచాయతీ కార్యదర్శులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గ్రామపంచాయతీల్లో నిధులు లేకపోవడంతో చెత్త సేకరణ ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారింది. ట్రాక్టర్లలో డీజిల్ పోయడం, అత్యవసర పనుల కోసం పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ నిధులు రాకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. ఒక్కో గ్రామ పంచాయతీలో వివిధ పనులు చేపట్టడానికి రూ.50వేల నుంచి రూ.లక్షా వరకు అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నామని కార్యదర్శులు వాపోతున్నారు.

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వర్షాకాలం ప్రారంభంలోనే గ్రామాల్లో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా పారిశుధ్య పనులు చేపట్టేవారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించేవారు. దీంతో గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకపోవడంతో వ్యాధుల జాడ కనిపించలేదు. పల్లె ప్రకతివనాలు, వైకుంఠధామాలతో గ్రామాల్లో కొత్త శోభ సంతరించుకున్నది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో పల్లెల్లో పడకేసిన పారిశుధ్యంతో వ్యాధుల ముప్పు పొంచి ఉందని ప్రజలు వాపోతున్నారు.

### కనిపించని శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



# ఇంటింటికీ ఉద్యమం

- ఎలివేటెడ్ కారిడార్ పరిహారం..
- వెడల్పుపై స్పష్టత ఇవ్వాల్సిందే
- ఇంటింటికీ రాజీవ్ రహదారి ఉద్యమం
- భూసేకరణపై కొలిక్కి రాకపోతే..
- నిరసనలు తప్పవని జేఏసీ హెచ్చరిక



సమావేశంలో పాల్గొన్న రాజీవ్ రహదారి జేఏసీ నేతలు

సిటీబ్యూరో, జూన్ 15(నమస్తే తెలంగాణ): పరిహారం, రహదారి వెడల్పు తేలకుండానే హెచ్ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్ విషయంలో ముందుకు సాగుతుండటంతో.... రాజీవ్ రహదారి బాధితులు ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. భూసేకరణ వ్యవహారం కొలిక్కి రాకుండా, బాధితుల ప్రధాన డిమాండ్లను పరిష్కరించకుండానే ప్రాజెక్టును చేపట్టేలా వ్యవహరిస్తున్న ప్రభుత్వాన్ని ఉద్యమం ద్వారా ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఏర్పడిన రాజీవ్ రహదారి జేఏసీ ఆధ్వర్యంలోనే ఆందోళనలు, నిరసనలు, రాస్తారోకోలు, సీఎం రేవంత్‌రెడ్డికి తమ గోడును వినిపించేలా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### ఉద్యమానికి నిర్ణయం..

జేఏసీ నాయకులు తేలుకుంట సతీశ్, సభ్యుల ఆధ్వర్యంలో సమావేశమైన జేఏసీ సభ్యులు.. ఉమ్మడి కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. ఆదివారం ఉద్యమ బాట పట్టేందుకు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటికీ పార్టీలకతీతంగా తమ ఆవేదనను వివరించామని, తమకు మద్దతు తెలిపే పార్టీల సహకారంతో ఎలివేటెడ్ కారిడార్ ద్వారా జరుగుతున్న నష్టాన్ని ఎదుర్కొనేలా ఉద్యమించాలని తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో ఇన్నాళ్లు విన్నపాలతో నెట్టుకొచ్చినా.. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో.. ఉద్యమంతోనే తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నారు.

### వెడల్పు తగ్గించడం..

ఎలివేటెడ్ కారిడార్ వెడల్పును 200 మీటర్ల నుంచి 100-150 మీటర్లకు తగ్గించడం, రక్షణ శాఖకు చెల్లిస్తున్నట్లుగానే పరిహారం వంటి ప్రధాన డిమాండ్ల సాధన కోసం జేఏసీ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. ఇక ఇంటింటికి ఎలివేటెడ్ కారిడార్ ఉద్యమ కార్యాచరణను తీసుకెళ్లేలా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. తామేప్పుడు ఎలివేటెడ్ కారిడార్‌ను వ్యతిరేకించడం లేదని, కానీ ప్రభుత్వమే తమ గోడును పట్టించుకోవడం లేదన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి తెలిసేలా ఎలివేటెడ్ కారిడార్ ప్రధాన డిమాండ్ల సాధన కోసమే ఉద్యమించాలన్నారు.

# ప్లాస్టిక్‌ను అనుమతించవద్దు

- అటవీశాఖ అధికారి సువర్ణ
- కేబీఆర్ పార్కు సందర్శన

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : అటవీశాఖ పార్కుల్లోకి ప్లాస్టిక్ కవర్లను, ప్లాస్టిక్‌తో తయారుచేసిన వస్తువులను అనుమతించవద్దని, వాటి నియంత్రణను అధికారులు సమర్థంగా అమలుచేయాలని అటవీశాఖ ప్రధాన అధికారి డాక్టర్ సువర్ణ ఆదేశించారు. ఆదివారం ఆమె కాసు బ్రహ్మానందరెడ్డి పార్కును సందర్శించారు. వాకర్స్‌తో ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి కల్పించే వసతులు, సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్కులోని నెమళ్లు, పావురాలకు బయటి ఆహారం పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్కులో కుక్కల బెడద తీవ్రంగా ఉందని వాకర్స్ చేసిన ఫిర్యాదును ఆమె పరిగణనలోకి తీసుకున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎఫ్‌వోతోపాటు ఇతర ఉన్నతాధికారులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.